క్లుప్తంగా

వైభవంగా కోటి పడగల పుణ్య క్షేత్రం మహోత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురం కోటి పడగల పుణ్య క్షేత్రమైన శ్రీ వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారి దేవస్థానం షష్ఠి పూర్తి వార్షిక కార్యక్రమ మహోత్సవాన్ని శుక్రవారం బాలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ.. సకల మానవుల దోషాలు తొలగించి సుఖశాంతులు కలింగే నాగదేవత స్వామి ఆవిర్భవించి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏటా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెల్లవారు జామున ఉదయం ప్రభాత సేవ, నాగదేవతకు అభిషేకములు, అర్చనలు, అష్టోత్తర శత నామ పూజలు జరిపారు. కార్యక్రమాలను వంగర చలమయ్య సిద్ధాంతి, జొన్నా వెంకట రత్నం గురుస్వాములు పర్యవేక్షించారు. భజన భక్త సమాజం నిర్వహించిన కోలాటంలో భక్తులు పాల్గొన్నారు. చుట్టు పక్కల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయగా వారికి అన్నదానం నిర్వహించారు.

సిగ్నల్స్‌ని ఏర్పాటు చేయండి సారూ!



చెరుకుపల్లి: 216ఎ జాతీయ రహదారిపై డివైడర్ల వద్ద అధికారులు సిగ్నల్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో డివైడర్ల వద్ద నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. జాతీయ రహదారిపై చెరుకుపల్లి–భట్టిప్రోలు.. చెరుకుపల్లి–జిల్లా కేంద్రం బాపట్ల వైపు జాతీయ రహదారిపై రోజూ అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెరుకుపల్లి ఖాదర్ ఖాన్ సెంటర్, గుళ్లపల్లి కోటీ సెంటర్, గుళ్లపల్లి వద్ద నగరం వెళ్లే రోడ్డు వద్ద సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వాహన చోదకులకు స్పష్టంగా మార్గం తెలిసేలా వాహనాల స్పీడు నియంత్రించేలా డివైడర్ల వద్ద సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

డీజే వాహనం తగిలి విరిగిన విద్యుత్ స్తంభం



కొల్లూరు: వినాయక నిమజ్జనానికి డీజే బాక్స్‌లతో వెళుతున్న వాహనం తగిలి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ సంఘటన మండలంలోని ఆవులవారిపాలెం నక్కపాయ వద్ద చోటుచేసుకుంది. శుక్రవారం వినాయక విగ్రహం నిమజ్జనానికి ఓ వాహనానికి డీజే బాక్స్‌లను వెడల్పు గల వాహనానికి కట్టారు. ఈ వాహనానికి కట్టిన కర్రలు విద్యుత్ తీగలకు తగలడంతో ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి నేలవాలిందని అన్నారు. స్తంభం పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడడంతో సిమెంట్ రేకులు ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి(వేమూరు): పెరవలి గ్రామంలో 33–11 కేవీ సబ్ స్టేషన్ కొత్త లైను ఏర్పాటు కోసం 11 కేవీ పెరవలి ఫీడర్‌లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో చావలి, కోడిపర్రు, పెనుమర్రు, గ్రామాల్లో.. అగ్రికల్చర్ పొలాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పీఏఐ ట్రైనింగ్ నేడు

అమర్తలూరు(వేమూరు): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీఏఐపై ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జొన్నలగడ్డ వినయబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం ఉదయం 10 గంటలకు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ ఆధార్ కార్డు జిరాక్స్.. లింక్ అయిన మొబైల్ నంబరు వెంట తీసుకుని రావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

యూరియా కోసం రైతులు పడిగాపులు

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేని యూరియా
- పీఏసీఎస్ కేంద్రాల్లో యూరియా పంపిణీలో కూటమి నాయకులకే ప్రాధాన్యం



కొల్లూరులో యూరియా లేకపోవడంతో కాంప్లెక్స్ ఎరువులతో ఉన్న జీడీసీఎంఎస్ కేంద్రం

కొల్లూరు: ఖరీఫ్ సాగు ఆదిలోనే రైతులను యూరియా కొరతతో ఉరుకులు, పరుగులు పెట్టిస్తుంది. కూటమి ప్రభుత్వం సాగుకు అవసరమైన యూరియా సరఫరా చేయడంలో విఫలమవ్వడం రైతుల పాలిట శాపంగా మారింది. అరకొరగ అందుతున్న యూరియా సైతం అధికారంలో ఉన్న కూటమి నాయకులకే పరిమితం అవ్వడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం మొదటి దశలో యూరియా కేటాయింపులను మించి వచ్చినట్లున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం రైతాంగానికి ఒక్క బస్తా యూరియా దొరకకపోవడం, యూరియా పంపిణీలో చోటుచేసుకుంటున్న అవకతవకలకు అద్దం పడుతుందని రైతులు వాపోతున్నారు.

పేరుకే రైతు సేవా కేంద్రాలు..

రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయడంతో పాటు, రైతులకు సేవ చేయడానికి ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలు నామమాత్రంగా మిగిలాయి. ఖరీఫ్ సాగు ఆరంభమైన దగ్గర నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా సక్రమంగా యూరియా పంపిణీ చేపట్టడంలో కూటమి ప్రభుత్వంతో పాటు, వ్యవసాయ శాఖాధికారులు కూడా విఫలమయ్యారన్న విమర్శలు వినబడుతున్నాయి.

> 5 రోజుల క్రితం క్రాపం సొసైటీకి 20 టన్నుల యూరియాను సరఫరా చేసిన వ్యవసాయ శాఖాధికారులు, లోటు అధికంగా ఉన్న ఇతర ఆర్ఎస్‌కేలను విస్మరించి మరో 20 టన్నుల యూరియా క్రాప రైతు సేవా కేంద్రానికి కేటాయించడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే 5 రోజుల క్రితం క్రాప ఆర్ఎస్‌కేకు సరఫరా చేసిన 20 టన్నుల యూరియా శుక్రవారం పంపిణీ చేయడం రాజకీయ కుమ్ములాటను బహిర్గతం చేస్తోంది.

కొల్లూరు మండలంలో 12 వేల ఎకరాలలో వరి, మరో 6 వేల ఎకరాలలో ఉద్యానవన పంటలు సాగు జరుగుతుంది. మండలంలో 14 రైతు సేవా కేంద్రాలు ఉన్నప్పటికీ ఒక్క క్రాప, రావికంపాడు రైతు సేవా కేంద్రంలో మాత్రం 20 టన్నుల చొప్పున యూరియాను శుక్రవారం పంపిణీ చేశారు. మరోపక్క మండలంలో గాజుల్లంక, ఈపూరు, క్రాప, దోనేపూడి పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేయాల్సిన యూరియా కూటమి ప్రభుత్వంలోని టీడీపీ నాయకులకే చేరుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం గాజుల్లంక పీఏసీఎస్ ద్వారా 16.50 టన్నుల యూరియా పంపిణీ జరగగా.. రైతులు యూరియా కోసం ఎగబడడం యూరియ కొరతకు అద్దం పడుతుంది.

కూటమి నాయకులకు పెద్దపీట..

యూరియా కేటాయింపుల్లో వ్యవసాయశాఖాధికారులు రాజకీయ వత్తిళ్లకు తలొగ్గి అసమానతలు చూపుతున్నారన్న ఆరోపణలు రైతులలో వ్యక్తమవుతున్నాయి. యూరియా కోసం వారాల తరబడి ఎదురు చూస్తున్న ప్రాంతాలకు సరఫరా చేయకుండా రాజకీయ నాయకులు సూచించిన ప్రాంతాలకు తరలించి చేతులు దులుపుకోవడం ఏమిటన్న ప్రశ్నలు కర్షకులలో లేవనెత్తుతున్నాయి. మండలంలోని ఈపూరు, చిలుమూరు, అనంతవరం, రావికంపాడు, చినపులివర్రు, తాడిగిరిపాడు గ్రామాల్లో యూరియా కోసం రైతులు మొరపెట్టుకుంటున్నా వ్యవసాయశాఖాధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పెడచెవిన పెడుతున్నారన్న విమర్శలు వెలువడుతున్నాయి.

అమరవీరుల స్ఫూర్తితో మరో ఉద్యమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

రేపల్లె: బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని.. స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ(ఎంఎల్), సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తాలూకా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం ముందు ప్రతిజ్ఞ నిర్వహించారు. బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో పోలీస్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండని పిలుపునిచ్చిన కూటమి నాయకులు.. నేడు విద్యుత్ ఛార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో ఆగస్టు 28న తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పోరాటానికి 25 ఏళ్లు గడిచాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంపు భారం చూస్తుంటే ఇప్పుడు పెంచుతున్న విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ మరోసారి వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటానికి ప్రజలు సిద్ధమవుతున్నారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)నాయకులు ఎం.శోభారాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎం.ఈశ్వరరావు, సుబ్బారావు, డీవైఎఫ్ఐ యువజన సంఘం రేపల్లె ఏరియా కమిటీ అధ్యక్షులు సీహెచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలని, విద్యుత్ అమరవీరుల ఆశయాలను సాధిస్తామని, కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతామని, విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా పథకాలను వివరిస్తున్న ఆర్‌బీఐ జనరల్ మేనేజర్

చుండూరు(వేమూరు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ జనరల్ మేనేజరు రాజేష్ కుమార్ మహనా తెలిపారు. చుండూరు మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల గురించి ప్రతి గ్రామ పంచాయతీలో క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్, ఏసీఎం, పి.ప్రభాకర్, నూపాం గోష్, ప్రటీన్, బీవీఎస్ స్వామి, పీవీ శ్రీనివాసరావు, పి.జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

మరువలేని భాష తెలుగు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కార్యక్రమంలో నివాళులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

చుండూరు(వేమూరు): తెలుగు భాష మరువలేని భాష అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు తెలిపారు. యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ రావి సాయిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్‌బాబు, శ్రీనివాసయాదవ్, అప్పారావు, జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: మాతృభాష తల్లివంటిదని.. ఎక్కడ ఉన్నా తమ భాషను మరువకూడదని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సి.రవిచంద్రకుమార్ తెలిపారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, కందుకూరి వీరేశలింగం పంతులు జీవిత చరిత్రపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనురాధ, నరసయ్య, కోటేశ్వరరావు, దాసు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవం నిర్వహించారు.

డీజేకి పర్మిషన్ ఇవ్వాలని గ్రామస్తుల ధర్నా



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్ యాదవ్

అల్లూరు(కర్లపాలెం): వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజే బండికి పర్మిషన్ ఇవ్వాలని అల్లూరు గౌడపాలెం గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గౌడపాలెం గ్రామస్తులందరూ వినాయక చవితి సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా వేసిన పందిరిలో గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూడో రోజు ఉదయం స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు డీజే బండి ఏర్పాటు చేశారు. గ్రామోత్సవానికి బయలుదేరుతున్న సమయంలో పోలీసులు వచ్చి డీజే బండికి అనుమతి లేదని డీజే బండి లేకుండా నిమజ్జనం చేసుకోవాలని గ్రామస్తులకు చెప్పారు. దీంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ ఎంవి శివకుమార్ యాదవ్ గ్రామస్తుల వద్దకు వచ్చి డీజే బండికి ఎస్పీ అనుమతులు లేవని.. మైక్ సెట్ ఏర్పాటు చేసుకుని నిమజ్జనం చేసుకోవాలని గ్రామస్తులకు నచ్చచెప్పడంతో వారు నిరసన విరమించారు.

దమ్ము చక్రాలు రోడ్లపై నిషేధం



ట్రాక్టర్ యజమానులకు సూచనలు చేస్తున్న పరంధామరెడ్డి

నగరం: దమ్ము చక్రాల ట్రాక్టర్లు రోడ్లపై ప్రయాణించడం వల్ల రోడ్లు దెబ్బ తింటున్నాయని డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ టి.కె.పరంధామ రెడ్డి తెలిపారు. నగరం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ట్రాక్టర్ యజమానులతో మాట్లాడారు. వరినాట్లు సీజన్‌లో ఎక్కువగా ట్రాక్టర్ యజమానులు ఈ పొరపాటు చేస్తున్నారని.. పొలం గట్టు వరకూ సాధారణ టైర్లతో ప్రయాణించి పొలంలో దిగే ముందు దమ్ము చక్రాలను మార్చుకోవాలని.. పని ముగిసిన వెంటనే తిరిగి సాధారణ టైర్లను మార్చుకుని మాత్రమే రోడ్ల పైకి రావాలని ఆయన కోరారు. తప్పని సరి పరిస్థితుల్లో, తక్కువ దూరం ప్రయాణించేటప్పుడు సేఫ్టీ మెటల్ రింగ్‌ను వినియోగించాలని సూచించారు. దమ్ము చక్రాలతో రోడ్ల మీద పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెండు ట్రాక్టర్లకు అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు.

దోమల నియంత్రణకు చర్యలు

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ




తెనాలి అర్బన్: దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో జయప్రకాష్ నగర్‌లో దోమల నియంత్రణ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటిలో దోమల ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. దోమకాటు వల్ల జ్వరాలు, మలేరియా, డెంగీ, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, వంగాల పున్నారెడ్డి, శివగణేష్, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి పార్వతి తనయుడు

- మూడో రోజూ ఘనంగా పూజలు
- ప్రారంభమైన గణపతి గ్రామోత్సవాలు



ఘనంగా నిర్వహిస్తున్న ఈఎస్ఆర్ నగర్ విగ్రహ ఊరేగింపు



చెరుకుపల్లి వీరరాఘవపేటలో పూజలు



పిట్టలవానిపాలెంలో నిమజ్జన కార్యక్రమంలో మహిళలు

చెరుకుపల్లి: మండలంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఉదయం, సాయంత్రం అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో ఏకదంతుని నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చిన్నారులు, యువకులు, పెద్దల సందడి నడుమ వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి కనగాల పంట కాలువకు తరలించారు. మండల కేంద్రంలోని వీరరాఘవ పేటలో ఏర్పాటుచేసిన మండపం వద్ద శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కర్లపాలెం: వినాయక చవితి వేడుకల సందర్భంగా కర్లపాలెం, పివిపాలెం మండలాల్లో విశేష పూజలు నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అల్లూరు గౌడపాలెం, సంగుపాలెం, పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోనూ గణేష్ నిమజ్జనాలను ఘనంగా జరిపారు. పిట్టలవానిపాలెంలో గణేష్ విగ్రహానికి పూజా కార్యక్రమాలనంతరం మహిళలు గణేష్ విగ్రహాన్ని తమ భుజాలపై మోస్తూ నిమజ్జనానికి తరలివెల్లారు. కర్లపాలెం మండలంలోని ఎంవిరాజుపాలెం, తిమ్మారెడ్డిపాలెం, దమ్మనవారిపాలెం గ్రామాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

కొల్లూరు: బొజ్జ గణనాథుని పూజా మహోత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కొల్లూరు గౌడపాలెం బైపాస్ రోడ్డు ఎదురు వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం, స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత లడ్డూ వేలం వేశారు. మండలంలోని చినపులివర్రులో విగ్రహానికి నిమజ్జనం చేశారు. కొల్లూరు లాక్ సెంటర్‌లోని వినాయక ఆలయం వద్ద అన్న సంతర్పణ జరిపారు.

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు..

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐలవరం–కనగాల రహదారిలోని వెల్లటూరు, భట్టిప్రోలు ఛానల్స్‌లలో నిమజ్జనోత్సవం చేశారు. భట్టిప్రోలు మాతా కాన్వెంట్ బాలికలు కోలాటంలో పాల్గొన్నారు.

రేపల్లె: విఘ్నేశ్వరుని విగ్రహాల నిమజ్జనోత్సవాలను శుక్రవారం కోలాహలంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లోని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెనుమూడి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.



కొల్లూరులో ఊరేగింపుగా ఏకదంతుడు



అద్దేపల్లిలోని గణనాథుడి గ్రామోత్సవం



రేపల్లెలో గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

సంచారజాతుల వార్షికోత్సవం నేడు

బాపట్ల అర్బన్: సంచార జాతుల 9వ వార్షికోత్సవం భీమవారంలో శనివారం నిర్వహించనున్నట్లు సంచారజాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చీలు రోడ్డు సెంటర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. దేశంలో సంచారజాతుల కులాల వారు అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. ఈ వార్షికోత్సవంలో వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్రా వీరన్నతో పాటు ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంచార జాతులు నాయకులు బిట్రా వెంకటేష్, కె.రాంబాబు, పసుపులేటి సాంబయ్య, చల్లా ఏడుకొండలు, చిత్తారి జకరయ్య, కత్తుల గోపి, ప్రతాప వెంకటేశ్వర్లు, కమాదుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శుల నియామకం

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా డి.ధనలక్ష్మి, ఎం.వెంకటేశ్వరమ్మ ఎంపికయ్యారు. శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆశా వర్కర్ల నూతన కార్యవర్గ ఎంపికను నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శుల ఎంపికతో పాటు మరో 20 మంది సభ్యులతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల యూనియన్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. నూతనంగా ఏర్పడిన జిల్లా అధ్యక్షురాలు డి.ధనలక్ష్మి, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరమ్మలు మాట్లాడుతూ.. జిల్లాలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాగా కోశాధికారిగా కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా వి.వెంకటేశ్వరమ్మ, దుర్గ, బి.ఝాన్సీలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా శీలమ్మ, వాణి, లక్ష్మీ, రాజకుమారి, స్వాతి, ఎన్నికయ్యారు.

రీ సర్వే పూర్తి చేసేందుకు చర్యలు

వేమూరు: రీ సర్వే పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో రెండో విడత రీ సర్వే చేయనున్నామని అన్నారు. సెప్టెంబరు నెల చివరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొదటి విడత వరహాపురంలో పూర్తి చేశామని అన్నారు. రెండో విడత పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రీ సర్వేలో రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. రైతులు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



తెనాలి అర్బన్: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ శాంతి పేర్కొన్నారు. కళాశాల, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తు పదార్థాల విముక్తి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల అనేక అనార్థాలు ఉన్నాయన్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. హెచ్ఐవీ పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాల కౌన్సిలర్ మహ్మద్ రఫీ, వివిధ సంస్థల కౌన్సిలర్లు టి.రజిని, కె.సులోచన, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ ఎం.వనజ, డాక్టర్ కె.నిర్మల జ్యోతి, కె.చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.